సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



మనసుంటే మలిదశా యవ్వనమే

వృద్ధాప్యం శాపం కావొద్దు. నిత్య నూతనంగా, ఉత్సాహంగా జీవనం కొనసాగాలి. నేడు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా కథనం. -8లో..



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

అక్రమంగా ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి 13 దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 438 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	440	475
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 194.260 కిలోలు

న్యూస్‌రీల్

'స్పందన' రద్దు

రాయచోటి: అక్టోబర్ 2వ తేదీ సోమవారం మహాత్మగాంధీ జయంతి సందర్భంగా 'జగనన్నకు చెబుదాం, స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ శనివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని, స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా కలెక్టర్ తెలిపారు.

రామయ్య హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 15 రోజులకు గాను రూ. 1 లక్షల 65 వేల 923 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ రంగమండపంలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రూ.21లక్షలు పలికిన గణపతి లడ్డూ



లడ్డూను తీసుకెళుతున్న శ్రీనివాసులురెడ్డి

రాయచోటి అర్బన్: పట్టణంలోని ఎంఎస్ఆర్ కాలనీలో వినాయకస్వామి లడ్డూ వేలం నిర్వహించారు. రూ. 21 లక్షలకు వైఎస్ఆర్‌సీపీ నేత మడితాటి శ్రీనివాసులురెడ్డి దక్కించుకున్నారు.స్వామివారి వద్ద ఉంచిన కలశం చెంబును కోళ్ల శ్రీనివాసులు రూ.2.30 లక్షలకు కైవసం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకున్న శ్రీనివాసులురెడ్డిని ఉత్సవకమిటీ సభ్యులు సత్కరించారు. గత ఏడాది జరిగిన వేలం పాటలో కూడా శ్రీనివాసులురెడ్డి లడ్డూను రూ.5లక్షలకు దక్కించుకున్నారు.

నూతన నియామకం

రాయచోటి : వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా డాక్టర్ అనిత చక్రవర్తిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లా పరిధిలోని తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన అనితచక్రవర్తి పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పని చేస్తోంది. శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులను పత్రికలకు అందజేశారు.

రైలు గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని మధురై–ఓకా మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు గడువును డిసెంబరు 1వ తేదీ వరకు పొడిగించారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. అక్టోబరు 6, 13, 20, 27, నవంబరు 3, 10, 17, 24, డిసెంబరు 1న మధురై ఓకా (09519) రైలు శుక్రవారం అర్ధరాత్రి 1.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజున మధ్యాహ్నం 1.55 గంటలకు కడపకు, ఆదివారం ఉదయం 10.20 గంటలకు ఓకా చేరుతుందన్నారు. ప్రయాణికుల రద్దీ బట్టి డిసెంబరు 1వ తేదీ వరకు ఈ రైలు నడపనున్నారన్నారు.

13న పాండిచ్చేరి విహారయాత్ర స్పెషల్ బస్సు



మదనపల్లె సిటీ: దసరా సెలవులను పురస్కరించుకుని ఈనెల 13న పాండిచ్చేరికి విహారయాత్ర స్పెషల్ సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 13న రాత్రి మదనపల్లెలో బయలుదేరి 14న పాండిచ్చేరికి చేరుకుంటుందన్నారు. అక్కడ రాక్‌బీచ్, వైట్‌సాండ్‌బీచ్, లైట్‌హౌస్, అరబిందో ఆశ్రమం, బాసిలిక చర్చి, షాపింగ్ చూసుకుని.. 15న ఉదయం పాండిచ్చేరి నుంచి మహాబలిపురం టెంపుల్, బీచ్, మధ్యాహ్నం వండలూరు జూ పార్కు చూసుకుని సాయంత్రం కంచిలోని అమ్మవారి దర్శనం తర్వాత రాత్రి బయలుదేరి మదనపల్లె కు చేరుతుందన్నారు.రాను,పోను చార్జి రూ. 2000 చెల్లించాలన్నారు. వివరాలకు 99592 25677, 91601 86645 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అందం.. ఆహ్లాదం

- రాయచోటి–రాజంపేట మార్గంలో ప్రయాణం నేత్రానందం
- 55 కిలోమీటర్ల ఘాట్‌రోడ్డులో చూడచక్కని లోయలు, చెట్లు
- చెయ్యేరు నది మధ్యలో కిలోమీటరు మేర హైలెవల్ బ్రిడ్జి
- శేషాచల అభయారణ్యంలో అందమైన రెడ్‌వుడ్ పార్క్



రెడ్‌వుడ్ జంగిల్ సఫారి



కొత్త అనుభూతిని అందిస్తున్న రాయచోటి–రాజంపేట రహదారి

సాక్షి రాయచోటి: ప్రకృతి మధ్య ప్రయాణం.. అందమైన అనుభవం.. పచ్చని కొండల మధ్య పల్లెలు ఆహ్లాదంతో అలరారుతున్నాయి. ఒకవైపు అందమైన చెయ్యేరు..మధ్యలో ప్రయాణం అలా కళ్లను కట్టిపడేస్తుంది. ఘాట్ రోడ్డు మలుపులు భయపెట్టకపోయినా...రోడ్డుకు అటు, ఇటు ఉన్న పచ్చని చెట్లు మాత్రం మనిషి మనసును పరవశింపజేస్తాయి. కొండ కోనల మధ్య సాగే గంటన్నర ప్రయాణంలో ఎన్నో మధురానుభూతులు కలుగుతాయి. శేషాచల అభయారణ్యంలో ఎటుచూసినా కనిపించే వేలాది రకాల పచ్చని చెట్లు మైమరిచిపోయేలా చేస్తున్నాయి. ఎక్కడ చూసినా ఆహ్లాదాన్ని తనివితీరా చూసేందుకు ఆగుతున్న వాహనాలు రోడ్డు వెంబడి కళ్లకు సాక్షాత్కరిస్తున్నాయి. కొండ కింద..నదీ పరీవాహక ప్రాంతంలో ప్రకృతి ఒడిలో పరవశిస్తున్న పల్లెలను చూస్తే ఊటీ, కొడైకెనాల్ తరహాలో వాతావరణం కనిపిస్తుంది.

- రాయచోటి నుంచి రాజంపేట ప్రయాణం అద్భుతంగా ఉంటుంది. ఇక్కడి నుంచి అక్కడికి సుమారు 55 కిలోమీటర్లు ఉంటుంది. ఘాట్ రోడ్డు..పచ్చని వాతావరణంలో కనిపించే పల్లెలు.. చెయ్యేరు బ్రిడ్జిపై పయనం మరిచిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. అనేక రకాల జంతువులకు ఆలవాలమైన శేషాచలం ప్రాంతంలో ఎటుచూసినా ఎత్తయిన కొండలు, పచ్చని వృక్షాలతో ప్రయాణం తెలియకుండానే అలా సాగిపోతుంది. వర్షాకాలమైతే ఎక్కడ చూసినా జాలువారుతున్న నీటితో కొండ ప్రాంతంలో సెలయేర్లు కనువిందు చేస్తుంటాయి.

ప్రత్యేక ఆకర్షణగా రెడ్‌వుడ్ జంగిల్

రాయచోటి–రాజంపేట మార్గంలో చెయ్యేరు తర్వాత బాలరాజుపల్లె దాటగానే ఘాట్‌రోడ్డులో ప్రయాణించే సమయంలో కనిపించే రెడ్‌వుడ్ జంగిల్ సఫారి ఆకర్షణీయంగా ఉంటుంది. అడవిలో అద్భుతమైన ప్రదేశాలు ఉన్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు పర్యాటకంగా అభివృద్ధికి చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. ప్రత్యేకంగా జంగిల్ సఫారి ప్రాంతం ఎర్రచందనం చెట్లతోనే నిండిపోయి ఉంటుంది. దీనిని అభివృద్ధిలోకి తెస్తే సెలవు రోజుల్లో విహార యాత్రకు ఎక్కువగా ఈ ప్రాంతాన్ని ఎంచుకునే అవకాశం కూడా లేకపోలేదు.

ప్రకృతి ఒడిలో సేద తీరుతున్న పల్లెలు

కొండ, కోనల మధ్య అనేక పల్లెలు ప్రకృతి ఒడిలో సేద తీరుతున్నాయి. చుట్టూ కొండల మధ్య అద్భుతమైన వాతావరణంలో సానిపాయి, బూడిదగుంటపల్లె గ్రామాలు ఉన్నాయి.అంతేకాకుండా బాలరాజుపల్లె, రోళ్లమడుగు గ్రామాలకు అటు, ఇటువైపు కొండలు ఉన్నాయి. చెయ్యేరు నది ఒడ్డున నివసిస్తున్న ఈ రెండు గ్రామాలను పరిశీలిస్తే కాలుష్యం లేని వాతావరణం కనిపిస్తుంది.

చల్లని వాతావరణం ఉంటుంది



నా పేరు బి.వెంకటరమణ. సానిపాయి పంచాయతీ బండకాడపల్లె గ్రామం. కొండల కోనల మధ్య గ్రామం ఉండడంతో ఎప్పుడూ చల్లని వాతావరణం ఉంటుంది. ఈ రహదారిలో రాజంపేటకు వెళ్లేటపుడు మంచి ఆహ్లాదకర వాతావరణాన్ని చూస్తుంటాం. చుట్టూ పచ్చని చెట్లు ఉండడంతో ప్రయాణం అలసట లేకుండానే హాయిగా సాగిపోతోంది. ద్విచక్ర వాహనంలో వెళ్లేటపుడు రహదారి మధ్యలో అక్కడక్కడ ఆగుతూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటాం. ఈ మార్గంలో ప్రయాణం కొత్త అనుభూతిని ఇస్తుంది.

మనసు పులకిస్తుంది



పాలెం ఘాట్‌లో ప్రకృతి రమణీయత మనసును పులకింప చేస్తుంది. ఘాట్ వెంబడి వృక్ష సంపద చూడ ముచ్చటగా ఉంటుంది. ఘాట్‌లో కొన్ని ప్రాంతాలు రమణీయతను సంతరించుకొని ఉన్నాయి. ఘాట్ వెంబడి ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

– లేబాకు గోపాలకృష్ణ, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, చక్రంపేట



ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న చెయ్యేరుపై ఉన్న బ్రిడ్జి





పచ్చని చెట్ల మధ్య బాలరాజుపల్లె గ్రామం

వంట ఏజెన్సీలకు ఊరట

- మధ్యాహ్నభోజన పథకానికి సరికొత్త వంటపాత్రలు
- ప్రభుత్వ పాఠశాలలో పంపిణీకి ఏర్పాట్లు



వంటసామగ్రి

రాజంపేట: మధ్యాహ్నభోజన ఏజెన్సీలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వంటపాత్రలు లేక ఇబ్బంది పడటం గమనించిన ప్రభుత్వం స్టీల్ డబరాలు, బేసిన్లు వంటి సామగ్రిని పంపిణీ చేయాలని నిర్ణయించింది. జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనలను ఆమోదించి అంగీకారం తెలిపింది. త్వరలో ఈ సామగ్రి పాఠశాలలకు చేరనుంది.

- జిల్లాలో 1538 ప్రాథమిక పాఠశాలు ఉన్నాయి. వీటిల్లో 1, 32,900 మంది విద్యార్థులు మధ్యాహ్నభోజన పథకం ద్వారా తమ ఆకలిని తీర్చుకుంటున్నారు. వీరందరికి చదువుతోపాటు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోరు ముద్ద పథకం ప్రవేశపెట్టారు. చిన్నారులకు ఐదురోజులు గుడ్డు, చిక్కీలతో చక్కటి భోజనం అందిస్తున్నారు.

తీరనున్న వంటపాత్రల సమస్య

నిత్యం భోజనం వండి వార్చే ఏజెన్సీలకు వంట పాత్రల సమస్య వేధిస్తోంది. 2010లో అప్పటి ప్రభుత్వం పాత్రలు ఇచ్చింది. అప్పటి నుంచి వాటినే ఉపయోగిస్తుండటంతో పాడైపోయిన వాటితో వంటలు చేసేందుకు మహిళలు అవస్థలు పడాల్సి వచ్చేది. ఇటీవల పాఠశాలలో వసతులు పెరగడం, విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావడంతో సమస్య తీవ్రమైంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనంలో మార్పులు చేసి అందుకు తగ్గట్టుగా వంట పాత్రలు సమకూరుస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా మంజూరు

విద్యార్థుల సంఖ్య ఆధారంగా వంటపాత్రలు మంజూరు చేసేందుకు పాఠశాలలను ఆరు కేటగిరీలుగా విభజించారు. 30లోపు ఉన్న చోట ఏ కేటగిరీగా , 31 నుంచి 50 వరకు ఉంటే బీ, 51–150 మధ్య సీ, 151–250 మధ్య డీ, 251–400 మధ్య ఈ, 400 అంతకన్నా ఎక్కువ ఉంటే ఎఫ్ కేటగిరీగా పాఠశాలలను విభజించారు. ఏ, బీ కేటగిరీలకు ఐదు , సీ, డీ, ఈ, కేటగిరీలకు 6, ఇ, ఎఫ్ కేటగిరీలకు 11 చొప్పున స్టీల్ డబరాలు, బేసిన్లు, కురిపి, కుళాయి, హస్తాలు తదితర సామగ్రి అందించనున్నారు.

త్వరలో పాఠశాలకు అందిస్తాం..

జిల్లా వ్యాప్తంగా పాఠశాలల వారీగా వంటపాత్రలు రానున్నాయి.ప్రభుత్వ నిర్ణయించిన కేటగిరీల ప్రకారం పంపుతాం. వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వంట ఏజెన్సీలకు అందజేస్తారు. దీంతో నిర్వాహకుల కష్టాలు తీరుతాయి.

–పురుషోత్తం, డీఈవో, రాయచోటి

5న శాసనసభ కమిటీ బీసీ సభ్యుల రాక

కడప సెవెన్‌రోడ్స్: వెనుకబడిన తరగతులకు సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు అక్టోబరు 5న రాష్ట్ర శాసనసభ కమిటీ బీసీ సభ్యులు జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ విజయరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీ చైర్మన్ రమేష్‌యాదవ్ రాజగొల్లకు బీసీ కుల సంఘాల నాయకులు సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. 6న ఉదయం 7 గంటలకు కడప పరిధిలోని బీసీ హాస్టళ్లను వారు తనిఖీ చేస్తారని, పది గంటలకు స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బీసీ సంఘాలు, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని, మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టర్, అధికారులతో సమావేశమవుతారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు వైవీయూ రిజిస్ట్రార్, ఇతర జిల్లా అధికారులతో సమావేశమై రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు సమీక్షిస్తారని వివరించారు.

నాడు–నేడు పనులపై అలసత్వం తగదు

డీఈఓ శ్రీరాం పురుషోత్తం



మాట్లాడుతున్న డీఈవో శ్రీరాం పురుషోత్తం

రాయచోటిటౌన్: నాడు – నేడు పనులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం హెచ్చరించారు. శనివారం రాయచోటిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యాప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రతి తరగతిలో ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి ప్రతి గ్రూపులో అన్ని కేటగిరీలకు చెందిన వారు ఉండే విధంగా చూస్తున్నామని తెలిపారు. ఇలా చేయడం వల్ల ప్రతి విద్యార్థి ఉత్తమ స్థాయికి ఎదిగేందుకు దోహదపడుతుందని చెప్పారు. నాడు – నేడు పనులలో ఇచ్చిన గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడైనా నిధులు లేవని తెలియచేస్తే అందుకు తగిన విధంగా సర్దుబాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ బడుల్లో చేరేది పేద విద్యార్థులేననే విషయం గుర్తు పెట్టుకొని కార్పొరేట్ స్థాయి విద్యాప్రమాణాలతో బోధించాలని చెప్పారు. ఉన్నత పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేశామని, అర్థం కాని అంశాలను ఇంటి వద్ద వీటి ద్వారా మరోసారి పునఃపరిశీలించుకోవచ్చుని చెప్పారు. విద్యాశాఖ సెక్రటరీ ఆదేశాల మేరకు ప్రతి రోజు పాఠశాలలను తనిఖీ చేస్తామని తెలిపారు.

ప్రజారోగ్యానికి రక్ష

- జిల్లా వ్యాప్తంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం
- 30 కేంద్రాల్లో 8 వేల మందికి చికిత్సలు



రామాపురంలో నిర్వహించిన వైద్యశిబిరంలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



కలికిరిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి, పక్కన ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

రాయచోటి: ప్రభుత్వం తలపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి స్పందన లభించింది. అన్నమయ్య జిల్లా పరిధిలో 30 ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమం ద్వారా 8,000 మందికి వైద్యచికిత్సలు అందించారు. మొదటి రోజు శనివారం నిర్వహించిన వైద్య శిబిరాల ద్వారా అన్ని వర్గాల ప్రజలతో పాటు చిన్నపిల్లలు, గర్భిణు, బీపీ, షుగర్, కేన్సర్, తదితర జబ్బులకు చికిత్సలను అందించారు. రాయచోటి నియోజకవర్గంలోని రామాపురంలో జరుగుతున్న 'సురక్ష'కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలికిరిలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, రైల్వేకోడూరు పేటలలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట నియోజకవర్గం నందలూరులో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మదనపల్లిలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ములకలచెరువులో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా చికిత్స కోసం వచ్చిన ప్రజలతో ఎమ్మెల్యేలు మాట్లాడి వారికి అందుతున్న వైద్యం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు

రాయచోటి: జిల్లాలోని కళాకారులకు గుర్తింపు కార్డులను జారీ చేయనున్నట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి టి. భరత్ కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన కళాకారులు వారి పూర్తి వివరాలతో అక్టోబర్ 5వ తేదీలోగా దరఖాస్తులను కార్యాలయంలో సమర్పించాలన్నారు. రాష్ట్రంలోని కళాకారులకు కొత్తగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ గుర్తింపు కార్డులు జారీ చేస్తారన్నారు.

క్లుప్తంగా

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : మండలంలో శనివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. ములకలచెరువుకు చెందిన లక్ష్మీనారాయణ(50), అజయ్‌కుమార్(36) ద్విచక్రవాహనంలో పులికల్లుకు వెళ్లి తిరిగివస్తుండగా ములకలచెరువు సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితుడ్ని 108లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.అలాగే మదనపల్లె పట్టణం రామిరెడ్డిలేఅవుట్‌కు చెందిన చంద్రయ్య(57), నీరుగట్టువారిపల్లె మార్కెట్‌యార్డు వద్ద రోడ్డు దాటుతుండగా చంద్రాకాలనీ భవానీనగర్‌కు చెందిన జగదీష్(22) ద్విచక్రవాహనంలో వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో చంద్రయ్య తీవ్రంగా గాయపడగా, జగదీష్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చంద్రయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో భార్యపై దాడి

మదనపల్లె : మద్యం మత్తులో భార్యపై భర్త దాడిచేసి గాయపరిచిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ బండకిందపల్లె ఎర్రబల్లి కాలనీకి చెందిన శేఖర్ మద్యంమత్తులో తన భార్య సుబ్బలక్ష్మి(38)పై దాడికి పాల్పడ్డాడు. కర్రతో తలపై బలంగా మోదడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనసుంటే మలిదశా యవ్వనమే

నిన్న బాల్యం.. నేడు యవ్వనం.. రేపు వృద్ధాప్యం.. ప్రతి మనిషి ఈ మూడు దశలు దాటాల్సిందే. అందుకే నేటి పిల్లలు వృద్ధాప్యంలో ఉన్నవారికి తోడుగా ఉండడమే కాదు.. ఆత్మీయంగా చేరదీయాల్సిన అవసరం ఉంది.వృద్ధాప్యం వచ్చిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ కొందరు ధైర్యంగా ముందడుగు వేస్తున్నారు. అంతేనా మనసుండాలేగానీ మలిదశ కూడా యవ్వనంగా మారిపోతుంది.. ముసలితనం పారిపోతుందని నిరూపిస్తున్నారు. నేడు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

నేడు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం



సమస్యలపై కలెక్టర్ గిరీషాకు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజెన్స్ అసోసియేషియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ

మదనపల్లె సిటీ : వృద్ధాప్యం శాపం కావొద్దు. అరోగ్యపరమైన అవరోధాలకులోనవ్వొదు. నిత్య నూతనంగా, ఉత్సాహంగా జీవనం కొనసాగాలి. పరిస్థితులకు అనుగుణంగా జీవనశైలి తీర్చిదిద్దుకోవాలి. పిల్లలు వయసు పైబడిన తల్లి దండ్రుల పట్ల ఆత్మీయంగా మెలగాలి. ఆసరాగా నిలవాలి. వెన్నుదన్నుగా మారాలి. భారంగా భావించి వారిని వృద్ధాశ్రమాల వైపు కాకుండా ఇంట్లోనే గుండెల్లో పెట్టి చూసుకోవాలి. వారికి మలిదశ మహానందంగా సాగేలా తోడ్పాటునందించాలి.

'చేరదీయండి...చెంతకు వెళ్లండి..

ఉద్యోగ,ఉపాధి రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్నా సొంతూరిలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు. సెలవులొచ్చినపుడు వీలు దొరికినప్పుడల్లా ఊళ్లో ఉన్న అమ్మా,నాన్నల దగ్గరికి వెళ్లాలి. ఏళ్ల తరబడి పెద్దవారికి కనిపించకుంటే చెప్పుకోలేని బాధ వారిని గుండెకోతకు గురి చేస్తుంది. ఒంటరిగా ఉన్నామన్న భావన రాకుండా ఆ పండుటాకుల పట్ల ప్రేమతో మెలగాలి. మనవలు, మనవరాళ్లు వారి చెంతకొస్తే ఎంతో సంతోషపడతారు. చిన్నపిల్లలను పెద్ద మనుషుల దగ్గరకు తీసుకెళ్లే వారి జీవితానుభవసారం రంగరించి మంచి, చెడు,తపొప్పులు నేర్పుతారు. సమాజం పట్ల బాధ్యతగా మెలిగే పౌరులుగా ఎదుగుతారు.

ఆ అనుభూతీ మధురమే

మనిషి జీవిత చక్రంలో బాల్యం,యవ్వనం లాగే వృద్ధాప్యమూ ఒక దశ. ఆ అనుభవాలను నెమరేసుకుంటూ ఈ దశలో సంతోషించాల్సిందే. వయోభారం కేవలం శరీరానికే తప్ప, మనసుకు కాదని భావిస్తే యువతరానికి దీటుగా నిలవొచ్చు.

ఈ పెద్దలు జ్ఞాన పెన్నిధులు

నిన్న విరిసిన పువ్వు నేటికి వాడిపోతుంది. దాని పరిమళమూ విరిగిపోతుంది. అది ప్రకృతి సహజం. కానీ ప్రకృతిని ధిక్కరించి ధీరులెందరో మన చుట్టూ ఉన్నారు. వారి ప్రతిభ కాలతీతంగా గుబాళిస్తుంది. వృద్ధాప్యంవారి ముందు చిన్నబోతుంది. వారిలో కొందరు సీనియర్ సిటిజెన్స్ గురించి..



మదనపల్లె పట్టణం ఎగువకువంకకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మునిగోపాలకృష్ణ సీనియర్ సీటిజన్స్ అసోసియేషన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, మదనపల్లె యూనిట్ అధ్యక్షునిగా పని చేస్తున్నారు. వయోవృద్ధుల కోసం అనేక సేవలు అందిస్తున్నారు ప్రతి నెల సమావేశాలు, ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహణ, సమస్యలు వుంటే వాటిని పరిష్కరిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ ఏడాది జిల్లా స్థాయిలో ఉత్తమ సీనియర్ సిటిజెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు.



విశ్రాంత ఉపాధ్యాయురాలు శకుంతలమ్మ జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థకు కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఏడు పదులు వయస్సు దాటినా సామాజిక సేవలు చేస్తున్నారు. పాఠశాలల్లో స్కౌట్స్ యూనిట్లు ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ ఏడాది సీనియర్ సిటిజెన్స్ అసోయేషన్ తరపున పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకుల ప్రతిమలు పంపిణీ, ప్లాస్టిక్ నిషేధం కోసం గుడ్డ బ్యాగులు పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. ఈమె సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ ఏడాది జిల్లా స్థాయిలో ఉత్తమ సీనియర్ సిటిజెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు.



మదనపల్లె పట్టణానికి చెందిన కె.ధనలక్ష్మి న్యాయశాఖలో ఏటగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రధానంగా వృద్ధుల సమస్యల పరిష్కరించడానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. వృద్ధాశ్రమాలకు సందర్శించి వారికి మనోధైర్యం కల్పిస్తున్నారు. ఆశ్రమాలకు తనవంతు సహాయ,సహకారాలు అందిస్తున్నారు. ఈమె సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ ఏడాది జిల్లా స్థాయిలో ఉత్తమ సీనియర్ సిటిజెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు.

రూ.2.30 లక్షలు పలికిన గణేష్ లడ్డు

గాలివీడు : మండల కేంద్రంలోని హర్ష పాఠశాల సమీపంలోని సీతారామ నగర్‌లోని వినాయకుడి విగ్రహాన్ని శనివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న 17 కేజీల లడ్డు వేలం పాటలను నిర్వహించగా అదే వీధికి చెందిన బత్తుల రామ్మోహన్ కుటుంబ సభ్యులు రూ.2.30లక్షలు వేలం పాట పాడి దక్కించుకున్నారు. 8కేజీల మరో లడ్డును కంచుకొమ్మల నాగరాజు రూ60వేలుకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. గేటు రామాలయంలోని ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమ వద్ద లడ్డు వేలం పాటలో కానాల కామేశ్వర్‌రెడ్డి రూ57,500లకు వేలం పాటలో స్వామి ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ముఖ్యఅతిథిగా వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బి.కొత్తకోట : కర్ణాటక నుంచి నిషేధిత మద్యాన్ని తరలిస్తున్న వారిపై నిర్వహించిన దాడుల్లో శనివారం ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. మండలంలోని బడికాయలపల్లి చెందిన ప్రసాద్ (30), యాలగిరివారిపల్లికి చెందిన నారాయణ స్వామి (45) కలిసి కర్ణాటకలో ఆరు బాక్సుల మద్యం కొనుగోలు చేశారు. ఈ బాక్సులను బైక్ పై బి. కొత్తకోట మండలంలోకి తరలిస్తుండగా దాడులు నిర్వహించి బడికాయలపల్లి చెక్ పోస్టు వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి నుంచి మద్యం, బైక్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే బి.కొత్తకోట నగర పంచాయతీ డేగానిపల్లి చెందిన పూల రవికుమార్ కర్ణాటక నుంచి 144 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా.. తానామిట్ట చెక్ పోస్టు వద్ద దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

దివ్యాంగ భర్తపై భార్య దాడి

మదనపల్లె : దివ్యాంగభర్తపై భార్య దాడిచేసిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. పెంచుపాడు పంచాయతీ కట్టుబావిగొల్లపల్లెకు చెందిన వెంకటరమణ(45) దివ్యాంగుడు. శనివారం బంగారు విషయమై భార్య మంగమ్మతో వెంకటరమణ గొడవపడ్డాడు. గొడవలో వివాదం ముదిరి భార్య భర్తపై కత్తితో దాడిచేసింది. ఘటనలో భర్త వెంకటరమణ గాయపడగా, స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



సంబేపల్లిలో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

సంబేపల్లి : అక్రమంగా ఎర్రచందనం దుంగలు తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 13 దుంగలతోపాటు ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి డీఎస్పీ మహమద్ బాషా తెలిపారు. శనివారం సంబేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని మోటకట్ల పంచాయతీ, పడమటివంట, బిదలబండ సమీపంలో వంకాయ తోటవద్ద కొందరు కొత్త వ్యక్తులు అనుమానంగా తిరుగుతున్నట్లు సంబేపల్లి ఎస్ఐ షరీఫ్‌కు సమాచారం అందిందన్నారు. వెంటనే సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్ళగా ఆ వ్యక్తులు పోలీసులపై రాళ్ళు రువ్వుతూ పారిపోయారన్నారు. వీరిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 13 దుంగలను, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు. వీటి విలువ దాదాపు రూ. 35 లక్షలు ఉంటుందని తెలిపారు. సుండుపల్లె ఫారెస్టు బీటు అధికారి నాగేశ్వరరావు, సంబేపల్లి పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలకు విలువనిచ్చే మనసున్న ప్రభుత్వమిది

- రాజకీయాలకతీతంగా పథకాల లబ్ధి
- ఎంపీ పీవీ మిథున్ రెడ్డి



లబ్ధిదారుకు ఇంటి పట్టా, చీర అందచేస్తున్న ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల

కలికిరి : రాష్ట్రంలో ప్రజలకు అత్యంత విలువనిచ్చే ప్రజా ప్రభుత్వం నడుస్తోందని రాజంపేట పార్లమెంటు సభ్యులు, పార్లమెంటు ప్యానల్ స్పీకర్ పీవీ మిథున్ రెడ్డి అన్నారు. మండలంలోని పత్తేగడ గ్రామంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి పట్టాలు మంజూరైన 280 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందచేశారు. ఈ సందర్భంగా పాళెం వద్దనున్న పర్యాటకశాఖ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ స్థానికగా ఉన్న టీడీపీ నాయకులకు ఏ మంచి పనిచేయడం చేతకాకున్నా... ప్రభుత్వం చేస్తున్న మంచి పనులపై కోర్టులకెళ్లి స్టేలు తీసుకురావడం దారుణమన్నారు. ఇప్పటికే ఒక్క పత్తేగడ గ్రామంలోనే రెండు లే అవుట్‌లలో పేదలకు పట్టాలివ్వకుండా స్టేలు తీసుకువచ్చి అడ్డుకున్నారని తెలిపారు. పేదల కోసం తాము ఎందాకైనా వెళతామని, ఇంటి పట్టా, జగనన్న కాలని ఇల్లు మంజూరైన ఒక్కో లబ్దిదారుకు రూ.7 నుంచి 10 లక్షల ఆస్తి సమకూరినట్‌లెత్తుందన్నారు. రాజకీయాలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు ఇస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆమెరికాకు వెళ్లి రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయంగా చాటుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల వైద్య సదుపాయాలకనుగునంగా పీలేరులో అత్యంత అధునాతన సదుపాయాలతో ప్రభుత్వాసుపత్రి రూపు దిద్దుకుంటోందన్నారు.

తప్పు చేసిన వారు చట్టానికి అతీతులు కారు..

అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టాలకు అతీతులు కారని టీడీపీ నాయకుడు చంద్రబాబునుద్దేశించి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో 16 చోట్లు సంతకాలు చేసి రూ.371 కోట్లు దోచుకున్న అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబును అరెస్టు చేయడంలో తప్పేముందన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు ఇంటి పట్టాలతో పాటు ఒక చీరను పంపిణీ చేశారు. మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడి పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



స్వగ్రామానికి చేరిన శివకుమార్ మృతదేహం

పుల్లంపేట : పుల్లంపేట మండల పరిధిలోని కుమారునిపల్లి హరిజనవాడకు చెందిన రాజబోయిన శివకుమార్ (52) ఆదివారం గుండెపోటుతో కువైట్‌లో మరణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారులు, ఏపీఎన్ఆర్‌సీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్ ఆధ్వర్యంలో మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. మృతుని భార్య, బిడ్డలు కన్నీటి పర్యాంతమయ్యారు. మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చేందుకు కృషి చేసిన వారందరికీ మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం చేసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. మదనపల్లె మండలం కొండామర్రిపల్లె పంచాయతీ బోడుమల్లుదిన్నెకు చెందిన ఇమామ్‌ఖాన్ కుమారుడు పి.అహ్మద్‌బాషా(19) కుటుంబసమస్యలతో శుక్రవారం రాత్రి పురుగుమందు తాగాడు. అదేవిధంగా బండమీదపల్లెకు చెందిన రహంతుల్లా భార్య హమీదా(24) కుటుంబసమస్యలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. అదేవిధంగా గుర్రంకొండ మండలం చెర్లోపల్లెకు చెందిన పెద్దన్న కుమారుడు నరేష్(54) కుటుంబసమస్యలతో మద్యంలో పురుగుమందు కలుపుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో కుటుంబసభ్యులు బాధితులను 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళ మృతి



మృతి చెందిన రసూల్ బీ

పెనగలూరు : మండలంలోని నారాయణ నెల్లూరు వద్ద శుక్రవారం సాయంత్రం జీపు.. ఆటో ఢీ కొన్న ప్రమాదంలో శనివారం మరొకరు మృతి చెందారు. తీవ్ర గాయాలై తిరుపతిలో చికిత్స తీసుకుంటున్న రసూల్ బీ (60) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఇద్దరు మృతి చెందగా శనివారం ఒకరు మృతి చెందారు. గాయాలపాలైన వారు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నట్లు వారు తెలిపారు.

స్నేహితుని దగ్గరకు వస్తూ..

ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మార్గమధ్యంలో చనిపోయిన వెంకటరమణ పెనగలూరులో నివాసముంటున్న స్నేహితుడైన నారాయణను చూసేందుకు చిత్తూరు జిల్లా, కెవిపల్లి మండలం, ఆవులయ్యగారిపల్లి నుంచి వచ్చాడు. మరో 15 నిమిషాలలో తన స్నేహితున్ని కలుసుకుంటాననుకుంటున్న సమయంలో ఈ ఘటన జరిగింది.


మనువరాలి వద్దకు వెళ్లి వస్తుండగా..

ఇక ఈ ప్రమాదంలో మృతి చెందిన రామయ్య, భార్య వెంగమ్మ కోడలితో కలిసి కారెంపల్లిలో ఉన్న మనువరాలి వద్దకు వెళ్లి చూసి తిరిగి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో రామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.

కుమారుని వద్దకు వెళ్లి వస్తుండగా..

తిరుపతిలో కాపురం ఉంటున్న ఏకైక కుమారుడు భక్షూ వద్దకు వెళ్లి పెనగలూరుకు వస్తున్న రసూల్ బీ కూడా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది.

ప్రమాదవశాత్తు వంకలో పడి..



ఏసు రత్నం మృతదేహం

దువ్వూరు : మండలంలోని భీమునిపాడు వద్ద ఓ వ్యక్తి బహిర్భూమికి వెళ్లి కాలు జారి వంకలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చాపాడు మండలం వి.రాజుపాళెం గ్రామానికి చెందిన పెండ్లికట్ల ఏసురత్నం (28) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గుడి పాడు నుంచి ప్రొద్దుటూరుకు వెళుతుండగా మార్గ మధ్యంలో భీమునిపాడు గ్రామంలో బహిర్భూమికి వెళ్లి కాలు జారీ వంకలో పడిపోయాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు, మైదుకూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలంలో గాలించి మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మూర్తి తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి



వైఎస్సార్‌సీపీలో చేరిన హనీఫ్, అతని అనుచరులతో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల తదితరులు

కలికిరి: కలికిరి పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మైనార్టీ జేఏసీ వ్యవస్థాపకుడు ఎంఐ హనీఫ్ తన అనుచరులతో రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఈ సందర్భంగా స్థానిక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు తగిన గుర్తింపు లభిస్తోందని, నమ్ముకుని పార్టీలోకి వచ్చిన వారికి తగిన గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందన్నారు. ఎంఐ హనీఫ్‌తో పాటు అతని అనుచరులు 150 మంది వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి ఎంపీ, ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఇందిరమ్మకాలనికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఖాదర్‌వల్లి, విశ్వేశ్వరయ్య, నిసార్ తదితరులు ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ తిమ్మారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బాబు అవినీతి సామ్రాట్.. లోకేష్ అవినీతి యువసామ్రాట్

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : చంద్రబాబునాయుడు అవినీతి సామ్రాట్ అయితే ఆయన కుమారుడు లోకేష్ అవినీతి యువసామ్రాట్ అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా ఎవరూ ఏమీ చేయలేరని, చట్టానికి ఎవరూ చుట్టాలు కాదని తెలియజేశారు. భారీగా అక్రమాలు చేసిన చంద్రబాబును అరెస్ట్ చేయకపోతే రాజ్యాంగానికి విలువ ఏముంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఖజానాను దోచుకున్న బాబు జైలుకు పోవడంతో ప్రజలకు చట్టాలపై మరింత నమ్మకం పెరిగిందన్నారు. చంద్రబాబు యువతకు స్కిల్స్ నేర్పించలేదు కానీ, తన స్కిల్స్‌తో వ్యవస్థను మేనేజ్ చేశాడని దుయ్యబెట్టారు. చంద్రబాబు చేసిన పాపాలన్నీ బద్దలైపోయాయి ఇక అన్నింటికి శిక్ష తప్పదని ఆరోపించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డిలు పాల్గొన్నారు.

నూతన నియామకం



జీవీ రాఘవరెడ్డి వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఆ పార్టీ న్యాయ విభాగం జోనల్ ఇన్‌చార్జిగా రాఘవరెడ్డిని నియమించినట్లు కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జీవీ రాఘవరెడ్డి ఇదివరకు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పనిచేశారు.

డాక్టర్ల విభాగం జిల్లా నూతన కమిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా డాక్టర్ల విభాగం, కడప నగర కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా అధ్యక్షుడిగా ఐ.శివానాయక్, ఉపాధ్యక్షులుగా ప్రదీప్‌రెడ్డి, కల్యాణ్, ప్రధాన కార్యదర్శులుగా నిరంజన్‌రెడ్డి, సుదర్శన్, మహబూబ్‌పీర్, అన్వర్‌బాష, గోపినాథ్, ఎన్.నాగరాజు, రాజ్‌కుమార్, సావిత్రి, బ్రాహ్మణి, కరుణాకర్, అంజనలతో పాటు సెక్రటరీలుగా సింధు, వంశీరెడ్డి, బాలకృష్ణ, మస్తాన్, నూర్‌బాష, గోవర్ధన్, గణేష్, రమేష్‌నాయక్‌లను నియమించారు.

స్టేట్ డాక్టర్స్ సెల్‌లో పలువురికి చోటు.. వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డిని జోనల్ ఇన్‌ఛార్జ్(జోన్-6)గా, కార్యదర్శులుగా ఎస్ఎఫ్ బాషా, డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డిలతో పాటు అన్నమయ్య జిల్లాకు చెందిన వి.రామ్మోహన్‌రెడ్డిలను నియమించారు.

రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపిక

చక్రాయపేట: జిల్లా స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఉమ్మడి కడప జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గండి గురుకుల పాఠశాలలో అండర్ 19 బాల బాలికల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శారద, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ విజయప్రసాదరెడ్డి, పీడీలు, పీఈటీలు సమక్షంలో క్రీడాకారుల ఎంపిక చేశారు.ఉమ్మడి కడప జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన కళాశాలలు,రెసిడెన్షియల్ పాఠశాలలు,ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, బాస్కెట్‌బాల్, రగ్బీ, నెట్‌బాల్, హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించి ప్రతిభకల వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.